సాక్షి
అనకాపల్లి
సోమవారం । 27 । మార్చి । 2023



## ప్రజల రక్షణకే ఆపద మిత్రలు

విపత్తులు, ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించేందుకు ఆపద మిత్ర వలంటీర్లను నియమించినట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. 8లో



## యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

యువత క్రీడలపై మరింత ఆసక్తి చూపాలని నన్నయ్య వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. 8లో



## కాఫీ పూల కళకళ

సాక్షి, పాడేరు : ఏజెన్సీలో కాఫీ తోటలు పూలతో కళకళలాడుతున్నాయి. మల్లెపువ్వుల మాదిరిగా కనువిందు చేస్తున్నాయి.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ (సోమ) | సహర్ (మంగళ) |
|---|---|---|
| అనకాపల్లి | 6-12 | 4-41 |
| నర్సీపట్నం | 6-17 | 4-40 |

## న్యూస్‌రీల్

### చిన్నారి వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్


చిన్నారి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పియర్ రాబిన్సన్ సిండ్రోమ్ వ్యాధితో బాధపడుతున్న నాతవరానికి చెందిన చిన్నారి అమర్త్యరామ్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.7.50 లక్షలు మంజూరైంది. ఆ చెక్కును బాబు తల్లిదండ్రులకు తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అమర్త్యరామ్ తల్లిదండ్రులు కలిసి తమ బిడ్డ పరిస్థితి వివరించారని చెప్పారు. సీఎం వెంటనే స్పందిస్తూ బాలుడి వైద్యానికి అవసరమయ్యే నగదు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఆ మేరకు సొమ్ము మంజూరైనట్టు ఎమ్మెల్యే చెప్పారు.

### ప్రశాంతంగా పోస్టల్ ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు


డైరెక్టర్‌గా ఎన్నికైన వీరభద్రానికి పత్రాన్ని అందజేస్తున్న సత్యకుమార్

అనకాపల్లిటౌన్: అనకాపల్లి, పాడేరు డివిజన్ల పరిధిలో పోస్టల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 11 మంది డైరెక్టర్లను సభ్యులు ఎన్నుకున్నట్టు రిటర్నింగ్ అధికారి వి.వి.సత్యకుమార్ తెలిపారు. డీసీఎంఎస్‌లో సోమవారం జరిగే ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులను డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకుంటారని చెప్పారు.

**ఎన్నికైన డైరెక్టర్లు వీరే..**
బి.నూకరాజు, వి.సింహాచలం, ఎం.శ్రీరామ్మూర్తి, ఎస్.హరీష్‌కుమార్, కె.వి.వి.ఎస్.గుప్తా, పి.శ్రీనివాస్, ఎల్.కె.ఎం.పాత్రుడు, సీహెచ్.సత్యారావు, వై.వీరభద్రం, కె.వి.నాగేశ్వరరావు, కె.కిరణ్‌కుమార్.

### 3 నుంచి ఈకోర్సాలో వేసవి క్రీడా శిబిరాలు

విశాఖ స్పోర్ట్స్: ఈకోర్సా వాల్తేర్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి మే నెలాఖరు వరకు నిర్వహించనున్నారు. ఐదేళ్ల నుంచి పదిహేనేళ్ల చిన్నారులకు అథ్లెటిక్స్‌తో పాటు బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టీటీ, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ వేసవి క్రీడా శిబిరాలను ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రికెట్, స్విమ్మింగ్, టెన్నిస్ క్రీడాంశాల్లో శిక్షణ నిబంధనల మేరకు ఎంపిక ఉంటుందన్నారు. శిబిరాల్లో పాల్గొనేందుకు తమ ఎంట్రీలను రైల్వేస్టేడియంలో నమోదు చేసుకోవచ్చన్నారు.

### కుక్కల దాడిలో ఏడు మేకల మృతి


మృతి చెందిన మేకలు

మాకవరపాలెం: వీధి కుక్కల దాడిలో ఏడు మేకలు మృతి చెందాయి. మండలంలోని శెట్టిపాలెంలో గొర్లి నూకాలమ్మకు చెందిన మేకల మందను గ్రామ శివారున గల కల్లంలో ఉంచారు. ఆదివారం ఉదయం ఈ మందపై వీధికుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఏడు మేకలు మృతి చెందగా, మరికొన్ని గాయపడ్డాయి. మృతి చెందిన మేకల విలువ రూ.లక్ష ఉంటుందని బాధితురాలు తెలిపింది.

## జీ-20 జోష్






## కార్నివాల్.. కెవ్వు కేక

బీచ్‌రోడ్డు(విశాఖ): తెలుగు వైభవం చాటేలా సాగరతీరంలో ఆదివారం నిర్వహించిన కార్నివాల్ అద్భుతంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన సందర్శకులు, పర్యాటకులతో బీచ్‌రోడ్డు జనసంద్రంగా మారింది. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు సాగిన ఈ కార్నివాల్‌తో బీచ్‌రోడ్‌లో పండగ వాతావరణం నెలకొంది. జీ-20 సదస్సు నేపథ్యంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు జీవీఎంసీ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్నివాల్.. మన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పింది. వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు కూచిపూడి, భరత నాట్యంతో అలరించారు. అరకు థింసా, బుట్టబొమ్మలు, కోలాటం, భామా కలాపం, వీర నాట్యం వంటి సంప్రదాయ నృత్యాలు అదరహో అనిపించాయి. యువతీ యువకులు దేశ భక్తి గీతాలకు తమదైన శైలిలో నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. పులి వేషాలు, కొమ్ము నృత్యాలు, తప్పెటగుళ్లు, కాళికా వేషాలు, బిందెల డ్యాన్స్, డప్పు వాయిద్యాలు, సాము గారడీలు, తదితర ప్రదర్శనలతో కళాకారులు సందర్శకులను మైమరపింపజేశారు. చిన్నారుల ఫ్యాషన్ షో,స్కేటింగ్ చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జీ-20 దేశాల జాతీయ జెండాలను ప్రదర్శించారు. ముందుగా ఈ కార్నివాల్‌ను రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గిరిజనులతో కలిసి నృత్యం చేశారు. కార్నివాల్‌లో విదేశీయులు సైతం వివిధ వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డిప్యూటీ మేయర్ జి.శ్రీధర్, మున్సిపల్ శాఖ స్పెషల్ సెక్రటరి శ్రీలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.


కొమ్మునృత్య కళాకారులతో మంత్రులు అమర్‌నాథ్, సురేష్




అలరించిన కొమ్ము నృత్యం


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విదేశీ మహిళల నృత్యం

## మారథాన్.. అదిరెన్

బీచ్‌రోడ్డు(విశాఖ): జీ-20 సదస్సుతో విశాఖకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని అన్నారు. జీ-20 సదస్సు నేపథ్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో ఉత్సాహంగా మారథాన్ జరిగింది. ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద రాష్ట్ర మంత్రులు విడదల రజని, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీ-20 సదస్సుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 3కె, 5కె, 10కె విభాగాల్లో పరుగు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ మారథాన్‌లో పెద్ద సంఖ్యలో నగర వాసులు, ముఖ్యంగా యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. విశాఖను ప్రపంచ పటంలో ప్రముఖ నగరంగా నిలపాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. ఇందులో భాగంగా ఈ నెల మొదటి వారంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విశేష స్పందన లభించిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు కుదుర్చుకున్నారని వెల్లడించారు. 200 మందికి పైగా అతిథులు పాల్గొనే జీ-20 సదస్సులో ఈ నెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ సదస్సుకు హాజరవుతున్న వారిని ఆకట్టుకునేలా రూ.157 కోట్లతో నగర సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, పోలీసు కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




పారాగ్లైడింగ్ ప్రారంభిస్తున్న మంత్రులు రజని, సురేష్, అమర్‌నాథ్

**ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్**
జీ-20 జెండాతో కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్ తీరం చుట్టూ చక్కర్లు కొట్టింది. సుమారు 30 నిమిషాల పాటు కోస్టల్ బ్యాటరీ నుంచి సాగరనగర్


మేము సైతం.. మారథాన్‌లో పాల్గొన్న బాలుడు, వృద్ధుడు

## వైద్య బృందాలు రెడీ

మహారాణిపేట: జీ-20 సదస్సు నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వైద్య బృందాలను సిద్ధం చేసింది. ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే జీ-20 సదస్సుకు 41 దేశాల నుంచి 200 మంది డెలిగేట్లు హాజరవుతున్నారు.

ఈ నేపథ్యంలో ప్రైవేట్, ప్రభుత్వ వైద్య బృందాలు సిద్ధం చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 27 నుంచి 31వ తేదీ వరకు విశాఖ విమానాశ్రయం, రాడిసన్ బ్లూ హోటల్ వద్ద అపోలో, ప్రభుత్వ వైద్య బృందం సేవలందిస్తుందని చెప్పారు. ప్రతినిధులు సందర్శించే ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాల్లో అంబులెన్స్‌లు, వైద్యులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## వైఎస్సార్ సీ వ్యూ ప్రారంభం

ఆరిలోవ(విశాఖ తూర్పు): జీ-20 సదస్సు కోసం బీచ్‌రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా సీతకొండ వద్ద సీ వ్యూ పాయింట్ నిర్మించారు. దీనికి వైఎస్సార్ సీ వ్యూ పాయింట్‌గా నామకరణం చేశారు. ఈ వ్యూ పాయింట్‌ను మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసిన ఐ లవ్ వైజాగ్, సోలార్ దీపాలు, కొండవాలులో రాళ్లపై పెయింటింగ్ ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు ఆదిమూలపు, గుడివాడ, విడదల, మేయర్ గొలగాని

## చంద్రబాబు త్వరలో జైలుకు వెళ్లడం ఖాయం

- ప్రభుత్వవిప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ



తుమ్మపాల: స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జైలుకెళ్లడం ఖాయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సీమన్స్ సంస్థ పేరుతో షెల్ కంపెనీలు సృష్టించారని ఆయన ఆరోపించారు. అనకాపల్లి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యవహారంతో తమ కంపెనీకి ఎటువంటి సంబంధం లేదని ఇప్పటికే సీమన్స్ ప్రతినిధులు స్పష్టం చేశారని తెలిపారు. నిరుద్యోగుల పేరిట బాబు దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. ఆధారాలతో సహా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అసెంబ్లీలో వివరించారని తెలిపారు. ఈ కుంభకోణంలో ఇప్పటికే నలుగురిని ఈడీ అరెస్టు చేసిందని, చంద్రబాబుపై కూడా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దేశచరిత్రలోనే ఇది అతిపెద్ద కుంభకోణమని తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసిన చంద్రబాబు అతిపెద్ద దొంగ అని అన్నారు. చంద్రబాబు విజన్ 2020 కాదని 420 అని రాష్ట్రప్రజలు గుర్తించాలన్నారు. ఈ స్కామ్ 2017లో బయటపడినప్పటికీ అధికారంలో ఉన్న చంద్రబాబు చక్కగా మేనేజ్ చేసి బయటకురాకుండా చేశారన్నారు. అన్ని ఆధారాలు పక్కాగా ఉన్నాయని, ఈ కుంభకోణం నుంచి బాబు బయటపడేది లేదని తెలిపారు. సీఐడీ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు పూర్తి విచారణ చేస్తున్నాయన్నారు. చంద్రబాబుపై చర్యలు తీసుకునే రోజులు త్వరలోనే వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నక్కరాజు ప్రభాకరరావు, గొల్లవిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు విజయోస్తు..


విజయ హోమంలో పాల్గొన్న విద్యార్థులు, (ఇన్‌సెట్) కల్యాణ వినాయకుడు

రాంబిల్లి: టెన్త్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ మండలంలోని పంచదార్ల పుణ్యక్షేత్రంలోని కల్యాణ వినాయకుడి సన్నిధిలో ఆదివారం విజయ హోమం నిర్వహించారు. భగవత్ భక్తి ప్రచార ట్రస్టు ఆధ్వర్యంలో అర్చకులు లక్ష్మీనారాయణ, సాయినాథ్ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిపారు. ఆరు మండలాల్లోని 25 ఉన్నత పాఠశాలలకు చెందిన 576 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తమకు విజయాన్ని ప్రసాదించాలని వారు గణనాథుడిని వేడుకొన్నారు. అనంతరం వీరికి స్వామివారి చిత్రపటం, పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

## అమ్మకు నీరాజనం..


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతరలో తొలి ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులుతీరారు. పట్టణ సీఐ దాడి మోహనరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ చర్యలు తీసుకున్నారు.

## కాగిత టోల్‌ప్లాజాకు రెండు అంబులెన్స్‌లు


కాగితటోల్‌ప్లాజాకు కేటాయించిన అంబులెన్స్‌లు

- అనకాపల్లి నుంచి అన్నవరం వరకు సేవలు
- 1033కి ఫోన్ చేస్తే క్షణాల్లో ఘటనా స్థలానికి


అంబులెన్స్ లోపలి భాగం

నక్కపల్లి: జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగని రోజంటూ ఉండదు. ప్రమాదాలు జరిగిన సమయంలో కొన్ని సందర్భాల్లో సకాలంలో వైద్యం అందక పలువురు మృతిచెందిన ఘటనలు కూడా ఉన్నాయి. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయరహదారిపై ఉన్న టోల్‌ప్లాజాలకు అంబులెన్స్‌లను కేటాయించింది. జిల్లాలో నక్కపల్లి మండలం కాగిత వద్ద ఉన్న టోల్‌ప్లాజాకు ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ఆధునాతన సౌకర్యాల(అడ్వాన్స్ లైఫ్ సపోర్టు)తో కూడిన రెండు అంబులెన్స్‌లను సమకూర్చింది. అనకాపల్లి నుంచి కాకినాడ జిల్లా అన్నవరం వరకు 90 కిలోమీటర్ల మేర టోల్‌ప్లాజా సేవలందుతున్నాయి. కాగిత టోల్‌ప్లాజాకు సమకూర్చిన రెండు వాహనాల్లో ఒకదాన్ని యలమంచిలి సమీపంలో ఉన్న కొక్కిరాపల్లి లోను, మరొక వాహనాన్ని అన్నవరం సమీపంలో తేటగుంట టోల్‌ప్లాజా యార్డు వద్ద అందుబాటులో ఉంచుతారు. శిక్షణ పొందిన సిబ్బంది ఈ వాహనాల్లో విధులు నిర్వహిస్తారు. ఆధునిక పరికరాలు ఉండటం వల్ల 90 శాతం ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని నేషనల్ హైవే అధికారి నూనె శ్రీనివాసరావు తెలిపారు. ఆపదలో ఉన్నవారు, ప్రమాదాల బారిన పడిన వారు 1033 నంబరుకు గాని, సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు గాని ఫోన్ చేయాలని చెప్పారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి 8లో

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

భాగవత శ్రవణం పరమానంద భరితంగా సాగింది. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అనకాపల్లిలోని రావుగోపాలరావు కళాక్షేత్రంలో ఆదివారం భాగవతంపై ప్రవచించారు.


ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న చాగంటి కోటేశ్వరరావు. వేదికపై డిప్యూటీ సీఎం బూడి

## హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు


విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

నర్సీపట్నం: విధి నిర్వహణలో అలసత్వం వహించిన ముగ్గురు హెచ్‌ఎంలు, నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఆదివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు జేసీ కల్పనా కుమారి కృషి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం అమలు తీరు పర్యవేక్షణలో భాగంగా డిప్యూటీ డీఈవో నర్సీపట్నం మండలంలోని పెదబొడ్డేపల్లి, నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్(మెయిన్), జిల్లా పరిషత్ హైస్కూల్(తురకబడి), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెట్టుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఒక్క బొడ్డేపల్లి స్కూల్ మినహా మిగిలిన పాఠశాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జెడ్పీ హైస్కూల్(తురకబడి) సోషల్ టీచర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పీఎస్, సోషల్ టీచర్లు, చెట్టుపల్లి హెచ్‌ఎం, జిల్లా పరిషత్ హైస్కూల్(మెయిన్) హెచ్‌ఎం, సోషల్ టీచర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## క్లుప్తంగా

### యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవులు

**అనకాపల్లి టౌన్:** రాష్ట్రంలో ఉపాధ్యాయలంతా నిత్య చైతన్యవంతులుగా ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.వి.రాఘవులు తెలిపారు. ఆదివారం స్థానిక మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంలో తీసుకుంటున్న చర్యలను పరిశీలించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అంతకుముందు యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నెల్లి సుబ్బారావు, అధ్యక్షురాలిగా వత్సవాయి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గొంది చినబ్బాయి, కోశాధికారిగా జె.వి.ఎన్.పి. రాజేష్, కార్యదర్శులుగా గుత్తుల సూర్యప్రకాష్, కాళింగ సతీష్, పాలిమేర చంద్రరావు, దొగ్గ శ్రీనివాస్, వి.రమేష్‌బాబు, వి.చైతన్యషీలా, ఎన్.శేషుకుమార్‌లను ఎన్నుకున్నారు.

### ఏలేరు కాలువలో రమణ మృతదేహం

**అనకాపల్లిటౌన్ :** తుమ్మపాల పంచాయతీ ఏలేరు కాలువలో దూకి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డ దాసరి రమణ(28) మృతదేహం ఆదివారం బయటపడింది. గ్రామీణ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ సింహాచలం అందించిన వివరాలు.. మండలంలోని బవులవాడ గ్రామానికి చెందిన దాసరి రమణకు కొత్తూరు పంచాయతీ సత్యనారాయణపురం గ్రామానికి చెందిన సంధ్యశ్రీతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి 9 నెలల బాబు ఉన్నాడు. ఈ నెల 24న కుటుంబకలహాల కారణంగా రమణ భార్యను పుట్టింట్లో వదిలి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శనివారం ఓ వ్యక్తి ఏలేరు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలియడంతో ఆ దిశగా విచారణ జరిపారు. ఆదివారం ఏలేరు కాలువలో రమణ మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**అనకాపల్లి టౌన్:** ఆధ్యాత్మిక చింతనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రంలో భాగవతం శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాగంటి ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దైవచింతనతో మోక్షం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని తొలుత డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రవచనాలు వింటున్న ప్రజలు గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి

# అలరించిన సినీ, టీవీ తారలు


జెమినీ మేళాను తిలకించేందుకు విచ్చేసిన ప్రేక్షకులు, అలరిస్తున్న యాంకర్ ఉధయభాను, సినీ నటి హరిత

**నర్సీపట్నం :** నర్సీపట్నంలో నిర్వహించిన జెమినీ మేళాలో సినీ, టీవీ నటులు తమ కార్యక్రమాలతో అలరించారు. అర్ధాంగి సీరియల్ లాంచ్ సందర్భంగా ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెమినీ మేళాను తిలకించేందుకు వేలాది మంది ప్రేక్షకులు తరలివచ్చారు. ఈ మేళాలో యాంకర్ ఉదయభాను తన వ్యాఖ్యానంతో ఉర్రూతలూగించారు. అర్ధాంగి సీరియల్‌లో నటిస్తున్న హరిత, పృధ్వీ, దుర్గా పలు సన్నివేశాలు, డ్యాన్స్‌లతో ప్రేక్షకులను అలరించారు.

సినీ గాయకులు సురేంద్ర, పావని తమ గానంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన జనంతో స్టేడియం కిక్కిరిసిపోయింది. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, సినీ నటుడు జోగినాయుడు కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమాన్ని తిలకించారు.

## 30 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

- రేపటితో ముగియనున్న ఎంట్రీల స్వీకరణ గడువు

**పాడేరు రూరల్ :** పాడేరు మోదకొండమ్మ తల్లి జాతర ఉత్సవాల సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ ఎంట్రీ గడువు ఈనెల 28తో ముగుస్తుందని నిర్వాహకులు కొట్టగుల్లి సుబ్బారావు, ఎ. రాజారావు, వి. మహేష్, కె. దుర్గారావు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.లక్ష నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతిగా రూ.50 వేల నగదు, షీల్డ్ బహుమతులు అందజేస్తామని వారు పేర్కొన్నారు. ఇవే కాకుండా టోర్నీలో పాల్గొన్న జట్లకు, ప్రతిభ కనబర్చిన జట్లకు, క్రీడాకారులకు కూడా ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. ఈ టోర్నీలో పాల్గొనే జట్లు రూ.3వేలు ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. క్రికెట్ టోర్నీ క్రికెట్ బాల్‌తో నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ప్రతి క్రికెట్ జట్టు నిబంధనలు పాటించాలని యూనిఫాం, షూ ధరించాలని కోరారు. క్రికెట్ మేనేజ్‌మెంట్ వద్ద క్రికెట్ కిట్ నిత్యం అందుబాటులో ఉంటుందన్నారు. టోర్నీలో పాల్గొనే జట్లు ఈనెల 28లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 29న క్రీడాకారుల సమక్షంలో డ్రా తీసి 30న క్రికెట్ పోటీలు ప్రారంభిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 8500574489, 8309668683, 9390824178 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

## యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

- నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు

**చోడవరం:** యువకులు క్రీడలపై మరింత ఆసక్తి చూపాలని నన్నయ్య వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. ఖండిపల్లిలో మార్క్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లాస్థాయి ఆటల పోటీలు ఆదివారం ముగిశాయి. నెహ్రూ యువకేంద్రం, కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. ముగింపు కార్యక్రమంలో ముత్యాలనాయుడు మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ కోచ్ అట్టా అర్జున్ రామకృష్ణను ఆయన అభినందించారు. జిల్లా నెహ్రూ యువకేంద్రం కో ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. కబడ్డీ, హైజంప్, లాంగ్ జంప్, రన్నింగ్, వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ సర్పంచ్ శానాపతి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

**కొంకోట:** స్కూలుకు వెళ్లిన పదో తరగతి విద్యార్థిని అదృశ్యం కావడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి ఆదివారం రాత్రి తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం హైస్కూలులో ప్రత్యేక తరగతులకు వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదన్నారు. దాంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కొంకోటలో నివాసం ఉంటున్న తండ్రి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

# ప్రజల రక్షణకే ఆపద మిత్రలు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

**అనకాపల్లి రూరల్:** పలు రకాల విపత్తులు, ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించేందుకు గాను జాతీయ, రాష్ట్రీయ విపత్తుల నిర్వహణ దళాలకు సహాయంగా ఉండేందుకుగాను ఆపద మిత్ర వలంటీర్లను నియమించినట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. శనివారం రాత్రి సంపతిపురం హార్ట్ ఫుల్ నెస్ కేంద్రంలో జిల్లా ఆపద మిత్ర వలంటీర్ల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రకృతి వైపరీత్యాల పట్ల ఆపద మిత్రలు అప్రమత్తంగా ఉండే విధంగా శిక్షణ ఇవ్వడం వారికి అదనపు అర్హతగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ నెల 14 నుంచి 25 వరకు ఇచ్చిన శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. కష్టకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి 200 మందిని ఆపద మిత్రలుగా ఎంపిక చేయగా, అందులో 150 మందికి సామర్లకోట ఐటీసీ కేంద్రంలో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. అనంతరం ఆపదమిత్ర శిక్షణ సర్టిఫికెట్లు, ప్రత్యేక కిట్లను పంపిణీ చేశారు.

ఆపదలో ఉన్నవారిని రక్షించేందుకు, తమను తాము రక్షించుకునేందుకు ప్రభుత్వం రూ.8 వేల విలువ చేసే కిట్లను అందజేసిందన్నారు. డీపీవో ఆర్.శిరీషారాణి, అడిషనల్ కమిషనర్ కృష్ణమోహన్, ఎంపీడీవో కె. ధర్మారావు, సర్పంచ్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ సారూ.. రేషన్ కార్డులిప్పించరూ..!

- పీత్రిగెడ్డ ఆదివాసీల అభ్యర్థన


రేషన్ కార్డులు లేని పీత్రిగెడ్డ ఆదివాసీలు

**రోలుగుంట :** మండలంలో ఆర్ల నూతన గిరిజన పంచాయతీ శివారు పీత్రిగెడ్డ గ్రామానికి చెందిన ఆదివాసీలు రేషన్ కార్డుల్లేక ఇక్కట్లు పడుతున్నారు. ఈ గ్రామంలో 12 కుటుంబాల్లో 30 మంది జనాభా ఉన్నారు. రేషన్ కార్డులు లేకపోవడంతో నిత్యావసరాల కోసం స్థానిక వ్యాపారుల వద్ద అధిక మొత్తానికి సరకులు కొనుగోలు చేయాల్సి వస్తోందని వీరు స్థానిక మీడియా వద్ద తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారులను రేషన్ కార్డుల కోసం కలిసి ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం కనిపించట్లేదని వాపోయారు. వలంటీర్‌ను అడిగితే ఆప్షన్ లేదని చెప్తున్నారని పేర్కొన్నారు. రేషన్ వచ్చే దిక్కులేక, తమ గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న వర్తకుల వద్ద అధిక మొత్తం చెల్లించి బియ్యం కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు గ్రామస్తుల తరపున, వారికి నిత్యం సహకరిస్తున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘ సభ్యుడు, సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు, మండల కార్యదర్శి శ్రీధర్ అధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌ను కలిసి మొరపెట్టుకోనున్నారు.

దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వరరావుని సాక్షి సంప్రదించగా తన వద్దకు రేషన్ కార్డుల కోసం ఇచ్చిన వినతులేవీ పెండింగ్‌లో లేవన్నారు. గతంలో వైస్ ఎంపీపీ దోనపర్తి వరలక్ష్మితో కలసి సమస్యలు తెలుసుకుని వారికి జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్టు తెలిపారు. సచివాలయంలో వారికి రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉందన్నారు. అక్కడ పని జరగకపోతే, తనను కలిస్తే అవసరమైన చర్యలు తీసుకుని, వారికి రేషన్‌కార్డులు జారీ చేస్తామని వెల్లడించారు.

## సంగీతం ప్రశాంతత వైపు నడిపిస్తుంది

- ప్రముఖ సినీ సంగీత దర్శకుడు థమన్


స్టూడియోలో రికార్డింగ్ విధానం పరిశీలిస్తున్న థమన్

**ఏయూక్యాంపస్:** వ్యక్తి మానసికంగా దృఢంగా మారడానికి సంగీతం సాధనంగా నిలుస్తుందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్.ఎస్ థమన్ అన్నారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఏయూ–సెయింట్ లూక్స్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ అకాడమీలో రికార్డింగ్ స్టూడియో, డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఆదివారం వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో కలసి థమన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు నేలలో ఓ అద్భుత శక్తి ఉందని.. సంగీతానికి ఇక్కడి భాష, యాస ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. సంగీతం విద్యార్థుల్లో ప్రశాంతత అందిస్తుందన్నారు. తన తండ్రి వల్ల సంగీత దర్శకుడు ఆశీర్వాద్‌తో తనకు అనుబంధం ఏర్పడిందన్నారు.

సుదీర్ఘ అనుభవం కలిగిన సంగీత దర్శకుడి మార్గనిర్దేశంలో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. సాంకేతికంగా మార్పులు యువతకు అవకాశాలను సృష్టిస్తున్నాయని.. యూట్యూబ్, ఇన్‌స్టా రీల్స్ చేస్తూ ప్రాచుర్యం పొంది, సినీ అవకాశాలను అనేక మంది దక్కించుకుంటున్నారన్నారు. ఆరోగ్యంగా, యవ్వనంగా జీవించాలంటే సంగీతం వినడం, సాధన చేయడం మంచిదన్నారు. అనంతరం విద్యార్థుల కోరిక మేరకు నిన్నిలా..నిన్నిలా..చూశానే అనే పాట ఆలపించారు. విద్యార్థులు ఆయనతో గొంతు కలిపారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ సంగీతాభిలాష కలిగిన విద్యార్థులకు ఈ అకాడమీ మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. తొలి దశలో దాదాపు 3.5 కోట్ల వ్యయంతో స్టూడియో, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నూతన విద్యా విధానంలో పేర్కొన్న విధంగా మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయంగా ఏయూను నిలుపుతున్నామన్నారు. అనంతరం వర్సిటీ తరపున థమన్‌ను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఆశీర్వాద్ లూక్స్, సెయింట్ లూక్స్ విద్యాసంస్థల చైర్మన్ ప్రీతం లూక్స్, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆచార్య సరస్వతి విద్యార్థి, ఆచార్య ఎ.కె.ఎం పవార్, ఆచార్య టి.షారోన్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.




## పోలీసునని నమ్మబలికి..

- బైక్‌తో అగంతకుడు పరారీ

**రాజవొమ్మంగి:** మాయమాటలు చెప్పి మోటారు బైక్‌తో పరారైన నకిలీ పోలీసు ఉదంతమిది. ఎస్ఐ జీఎస్ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన దూరి వేణుప్రసాద్ ఈ నెల 23వ తేదీన మోటారు సైకిల్‌పై రాజవొమ్మంగి వచ్చాడు. ఓ పాన్‌షాపు వద్ద కూల్ డ్రింక్ సేవిస్తున్న అతని వద్దకు ఓ ఆగంతకుడు వచ్చాడు. నేనే పోలీసునని.. ఒక సారి నీ బైక్ ఇవ్వు ఇంటికి వెళ్లి వస్తానని.. పక్కనే ఉన్న లాగరాయి మాగ్రామమని.. నా పేరు సీహెచ్. రాహుల్ చెప్పాడు. పోలీసునని చెప్పడంతో నమ్మిన వేణుప్రసాద్ బైక్‌ను ఇచ్చాడు. లాగరాయి వెళ్లి వస్తానన్న ఆ వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో మోసపోయానని గుర్తించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# హార్బర్ ఆధునికీకరణకు అంకురార్పణ!

- నెట్‌మెండింగ్, వాటర్ ట్యాంక్, పార్కింగ్ పనులకు శ్రీకారం
- రూ.151.82 కోట్ల వ్యయంతో మారనున్న రూపురేఖలు
- మత్స్యకారుల అభ్యర్థనతో డీపీఆర్‌లో స్వల్ప మార్పులు
- త్వరలో ఫ్లోటింగ్ జెట్టీల నిర్మాణానికి టెండర్లు


విశాఖ ఫిషింగ్ హార్బర్

**సాక్షి, విశాఖపట్నం:** విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచ శ్రేణి ఓడరేవుగా రూపాంతరం చెందబోతోంది. ఇన్నాళ్లు తగినంతగా నాణ్యతా ప్రమాణాలు, సదుపాయాలు లేకపోవడంతో ఇక్కడ నుంచి చేపలు ఆశించిన స్థాయిలో ఎగుమతులు జరగక చేపలకు మంచి ధర లభించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ హార్బర్ ఆధునికీకరణకు సాగరమాల పథకంలో పీఎం మత్స్య సమృద్ధి యోజన కింద రూ.151.81 కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. ఇటీవల ఈ పనులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో హార్బర్‌లోని ప్లాట్‌ఫాంల మరమ్మతులు, రెండు పెద్ద ఎయిర్ కండిషన్డ్ ఆక్షన్ హాలు, మత్స్యకారులకు విశ్రాంతి గదులు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్యాంటీన్, వాహనాల పార్కింగ్, చేపల రిటైల్ అమ్మకం షాపులు, నెట్ మెండింగ్ హాలు, కోల్డ్ స్టోరేజిలు, అత్యవసర ఫైర్ సబ్‌స్టేషన్ వగైరా ఏర్పాటు చేస్తారు. విడిగా ప్యాకింగ్ షెడ్, ఆటోమేషన్, లోడింగ్, అన్‌లోడింగ్ బే, డార్మిటరీలు, ఫుడ్‌కోర్టు, ఆర్‌వో ప్లాంటు, పెద్ద చేపల ఎగుమతికి వీలుగా కన్వేయర్ బెల్ట్ వంటివి కూడా అందుబాటులోకి వస్తాయి. చేపలను ఎండబెట్టడానికి 20 మెకానికల్, 10 సోలార్ డ్రయర్లు, అంతర్గత రోడ్లు ఏర్పాటవుతాయి. హార్బర్ ఆధునికీకరణలో కీలకమైన డ్రై నేజీ వ్యవస్థను కూడా మెరుగుపరచనున్నారు.

### డీపీఆర్‌లో స్వల్ప మార్పులు

మత్స్యకారులు, బోటు యజమానుల అభ్యర్థన మేరకు డీపీఆర్‌లో స్వల్ప మార్పులు చేశారు. ముందుగా ప్రతిపాదించిన 3,4,5 జెట్టీలకు బదులు జీరో జెట్టీకి సమాంతరంగా ఒక ఫ్లోటింగ్ జెట్టీ, చేపల వేలం, ప్యాకింగ్ ప్రాంతంలో కట్టడాలను తొలగించి కొత్తగా జెట్టీని నిర్మించనున్నారు. బుక్కా కెనాల్ వద్ద ఎఫ్ల్యుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న అసోసియేషన్ భవనాల స్థానంలో ఏసీ ఆక్షన్ హాళ్లు నిర్మించనున్నారు. అత్యవసరంగా బోట్ల మరమ్మతులకు డాక్ ఫెసిలిటీని సమకూరుస్తారు.

### మొదలైన ఆధునికీకరణ పనులు

మత్స్యకారులు వలలు కుట్టే నెట్ మెండింగ్ హాలు, వాటర్ ట్యాంకు పనులు, పార్కింగ్ ఫెసిలిటీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, అసోసియేషన్ల ఆఫీసు బేరర్ల భవనాల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఫ్లోటింగ్ జెట్టీలకు త్వరలోనే టెండర్లు పిలవడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆధునికీకరణ పనులు మొదలయ్యాయని, మిగిలినవి దశలవారీగా చేపడతారని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు. ఏడాదిన్నరలోగా ఆధునికీకరణ పనులను పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు.

# 2500 మందితో 'జీ-20'కి బందోబస్తు

- విదేశీ అతిథులను గౌరవించడం మన బాధ్యత
- సదస్సు విజయవంతానికి ప్రజలు సహకరించాలి
- విశాఖ పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ పిలుపు



**అల్లిపురం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీ-20 సదస్సుకు 2,500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు కల్పిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ వెల్లడించారు. బందోబస్తులో 1,850 సివిల్ పోలీసులు, 400 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, 4 గ్రే హౌండ్స్ యూనిట్లు, 2 క్యూఆర్‌టీ టీమ్‌లు, 6 స్పెషల్ పార్టీలు, 2 ఏపీఎస్పీ ప్లాటూన్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఆదివారం విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. సదస్సు వేదిక వద్ద సిబ్బంది ధరించాల్సిన యూనిఫాం, అధికారులు, సిబ్బంది పాటించాల్సిన నియమాలు, ట్రాఫిక్, ఇతర విధుల నిర్వహణలో ఇప్పటికే పలు సూచనలు చేశామన్నారు. అంతర్జాతీయస్థాయిలో విధులు నిర్వహించే విధానాలపై ఇప్పటికే అనుభవజ్ఞులైన వారితో ప్రత్యేక తరగతులు ద్వారా అధికారులకు తెలియజేశామన్నారు. సిబ్బంది, అధికారులు తమ విధులను పూర్తి నిబద్ధతతో నిర్వర్తించాలని ఆదేశించారు. అతిథులు నగరంలో పర్యటించే ప్రాంతాల్లో పర్యాటకులకు ప్రవేశం లేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.


జీ-20 సదస్సుకు ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో సిద్ధమైన సిబ్బంది

ప్రజలు, సదస్సుకు హాజరయ్యే వారికి ట్రాఫిక్‌లో అసౌకర్యం, అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. 28, 29, 30 తేదీల్లో రాడిసన్ బ్లూ హోటల్ పరిసర ప్రాంతాలు, బీచ్ రోడ్డు, ఇతర జంక్షన్లు రద్దీగా ఉండే అవకాశం ఉన్నందున నగరవాసులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎయిర్‌పోర్టు, తాటిచెట్లపాలెం, వేమన మందిరం, సిరిపురం, సీఆర్ రెడ్డి జంక్షన్, పార్క్ హోటల్, కురుపాం జంక్షన్, రాడిసన్ బ్లూ హోటల్ వరకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి.. ట్రాఫిక్ పోలీసులు నిర్దేశించిన ప్రాంతాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


మేము రెడీ అంటున్న రోప్‌పార్టీలు

### సిటీకి చేరుకున్న పోలీసులు

జీ-20 సదస్సు బందోబస్తుకు శ్రీకాకుళం, పార్వతీపురం ప్రాంతాల నుంచి పోలీసులు ఆదివారం పోలీస్ బ్యారెక్స్‌కు బస్సుల్లో తరలివచ్చారు. అక్కడ నుంచి వారికి కేటాయించిన స్థలాల్లో విధులు నిర్వహించేందుకు వెళ్లారు.

## క్లుప్తంగా

### సీతారాముల పెళ్లి రాట వేడుకలు



పెళ్లి రాట వేస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్: గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన 84వ వార్డు కొత్తూరు నర్సింగరావుపేట రామాలయంలో ఈ నెల 30న సీతారాముల కల్యాణ వేడుకల్లో భాగంగా ఆదివారం పెళ్లి రాటోత్సవం ఘనంగా జరిగింది. గ్రామస్తులు కశిరెడ్డి సత్యనారాయణ దంపతులు, కశిరెడ్డి రామారావు దంపతుల చేతుల మీదుగా వేద పండితులు శంకరశర్మ రాటకు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా సీతారామ మహిళా సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ సోమవారం సీతారాముల పంచలోహ విగ్రహాలు, సీతాదేవి సారె ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

### నేడు దుర్గమాంబ విగ్రహ ప్రతిష్టాపన



గోపాలపురంలో దుర్గమాంబ నూతన ఆలయం

అనకాపల్లిటౌన్: మండలంలోని గోపాలపురంలో సోమవారం దుర్గమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనుందని చెప్పారు. కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

### నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్: తాకాశివీధి స్వయంభూ నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య వేడుకల్లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వీరంతా చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్, కమిటీ సభ్యులు తాకాశి సూర్యారావు, తాకాశి కొండలరావు, బేతి ఈశ్వరరావు, తాకాశి కృష్ణ, తాకాశి నాగేష్, తాకాశి విస్సు, తాకాశి సత్యందొర, గంగుపాం మహేష్‌దొర, కారుకుండి కన్నా పాల్గొన్నారు.

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| సార్ | రాజా |
| కోస్టీ | సత్యనారాయణస్క్రీన్-1 |
| జాన్‌విక్ (చాప్టర్-4) | సత్యనారాయణస్క్రీన్-2 |
| కబ్జా | షిర్డిసాయి |
| బలగం | పర్తిసాయి |
| రంగమార్తాండ | వెంకటేశ్వర |
| పులి | శ్రీసత్య |
| దాస్ కా ధమ్కీ | రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-12 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 217 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.



# అక్కచెల్లెమ్మలకు ఆసరా

- 16,830 మందికి వైఎస్సార్ ఆసరా వర్తింపు
- 3 విడతలకు కలిపి రూ.39 81 కోట్లు జమ



వైఎస్సార్ ఆసరా పథకం గురించి మహిళలకు అవగాహన

కశింకోట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు ప్రగతి బాట పట్టారు. చిరు దుకాణాలు, చేతివృత్తులు, తదితర స్వయం ఉపాధి పనులతో జీవనాభివృద్ధి సాధిస్తున్నారు. తమ కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు. తాజాగా విడుదలైన మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధులు తమ జీవన స్థితిగతులను మరింత మెరుగుపర్చేందుకు దోహదపడతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 1,537 స్వయం సహాయక సంఘాల్లో 16,830 మందికి వైఎస్సార్ ఆసరా పథకం నగదు అందజేస్తున్నారు. ఇప్పటికే విడతకు రూ.13.27 కోట్ల వంతున మూడు విడతలకు కలిపి రూ.39 81 కోట్లు పైబడి బ్యాంకుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. ఒక్కొక్క సభ్యురాలికి విడతకు రుణాన్ని అనుసరించి రూ.5 వేల నుంచి రూ.18,750 వరకు జమ చేశారు. మరో విడత వచ్చే ఏడాది రానుంది. ఈ నగదుతో పాటు స్త్రీనిధి, బ్యాంకుల ద్వారా అదనంగా రుణాలను సమకూరుస్తోంది.

దీంతో వృత్తులను, వ్యాపారాలను అనుసరించి కిరాణా, గాజుల దుకాణాలు ఏర్పాటు, కుట్టు వృత్తి అభివృద్ధి, పాడి పశువుల కొనుగోలు, గొర్రెలు, మేకల మందల కొనుగోలు, వ్యవసాయ అభివృద్ధి చేసుకొని జీవనోపాధి మెరుగుపరచుకున్నారు. దీంతో ఆసరా పథకం ఎంతగానో ఉపయోగపడుతోందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని చెబుతున్నారు.

### సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



వైఎస్సార్ ఆసరా పథకంలో మూడు విడతలుగా రూ.10,836 వంతున జమ చేశారు. తొలి రెండు విడతల నగదుతోపాటు రూ.75 వేల బ్యాంకు రుణాన్ని సమకూర్చారు. ఈ సొమ్ముతో అదనంగా జిగ్‌జాగ్ మిషన్ కొనుగోలు చేశాం. డ్రెస్ మెటీరియల్, వస్త్రాలు విక్రయిస్తున్నాం. అదనంగా ఆదాయం సమకూరి మా కుటుంబ పరిస్థితి మెరుగుపడింది. వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– గుటాల పార్వతి, ఉగ్గినపాలెం

### కిరాణా దుకాణంతో..



మూడు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకంలో రూ.22,500 జమ చేశారు. తొలి రెండు విడతల నగదుతో రెండేళ్ల క్రితం కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనోపాధి సాగిస్తున్నాం. దీంతోపాటు బ్యాంకు రుణం, స్త్రీనిధి రుణం కలిపి రూ.లక్ష సమకూర్చారు. నా కుమారుడు కుమార్ లారీ డ్రైవర్‌గా పని చేయగా, వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. ఇప్పుడు డ్రైవర్ పని విడిచి దుకాణాన్ని ఇద్దరమూ నిర్వహిస్తూ జీవనోపాధి మెరుగుపరచుకున్నాం. ఇది ఎంతో ఆనందంగా ఉంది.

– గూడెపు మహాలక్ష్మి, బయ్యవరం

### నెలకు రూ.15 వేల వరకు ఆదాయం



గతంలో కూలీ పని చేసే వారం. వైఎస్సార్ ఆసరా కింద వచ్చిన రూ.31,500తో పాటు బ్యాంకు రుణం, స్త్రీనిధి రుణం కింద వచ్చిన రూ.1.50 లక్షలతో రెండు పాడి ఆవులను కొనుగోలు చేసి మేపుకుంటున్నాం. ఖర్చులు పోనూ నెలకు రూ.15 వేల వరకు ఆదాయం సమకూరుతోంది. కుటుంబాన్ని నెట్టుకురావడానికి సమృద్ధిగా సరిపోతోంది. ఇది తమకు ఎంతో ఆనందంగా ఉంది.

– బద్ది లక్ష్మి, బుచ్చియ్యపేట

### కుట్టు మిషన్‌తో జీవనోపాధి



వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడు విడతలుగా రూ.25,500 నగదు జమ చేశారు. ఈ నగదుతో కుట్టు మిషన్ కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నా. స్త్రీనిధి కింద సమకూర్చిన రూ.50 వేల రుణం తోడ్పాటునందిస్తోంది. ఏటా వృత్తిదారులకు ఇచ్చే రూ.10 వేలు అందుతోంది. మాలాంటి వారిని ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బోదెపు ఆదిలక్ష్మి, తేగాడ

### మహిళల స్వయం సమృద్ధి



వైఎస్సార్ ఆసరా పథకం కింద ఇప్పటికి మూడు విడతలుగా దాదాపు రూ.40 కోట్లు జమ అయింది. 1,537 స్వయం సహాయక సంఘాల్లో 16,830 మందికి నగదు జమ చేశాం. ఈ నగదుతోపాటు బ్యాంకు రుణం, స్త్రీనిధి రుణాలను అదనంగా అందిస్తున్నాం. వీటితో చేతివృత్తులు, వ్యవసాయం, పాడి పరిశ్రమ, వ్యాపారం తదితర రంగాల్లో మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తున్నారు. కుటుంబాలను అభివృద్ధి చేసుకుంటున్నారు.

– ఎస్. శ్రీనివాసరావు, ఏపీఎం, కశింకోట

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై 5న చలో ఢిల్లీ

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక భవనంలో వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యుత్ చట్టం వల్ల రాష్ట్రంలో రైతాంగానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోయారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులకు ఎటువంటి హక్కులు లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని చెప్పారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.30 వేల కోట్ల కోత విధించిందన్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంత కూలీలకు పనుల్లేక వలస పోతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాము, జి. వరలక్ష్మి, వి.సత్యవతి, ఉమా నారాయణమ్మ, వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము పాల్గొన్నారు.

**చలో ఢిల్లీ విజయవంతం చేయండి**

కశింకోట: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చే నెల 5న ఢిల్లీలో తలపెట్టిన కార్మిక- కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన కశింకోటలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాల రాస్తోందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఐద్వా జిల్లా నాయకురాలు డి. వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# చింతపండుకు భలే గిరాకీ



దేవరాపల్లి వారపు సంతలో చింతపండు కొనుగోలుకు వచ్చిన ప్రజలు, వర్తకులు



గిరిజన ప్రాంతం నుంచి వచ్చిన చింతపండు

- మణుగు రూ.450 నుంచి రూ.600 వరకు పలికిన ధర

దేవరాపల్లి : దేవరాపల్లిలో ఆదివారం జరిగిన వారపు సంతలో చింతపండుకు భారీ గిరాకీ నెలకొంది. మైదాన ప్రాంత గ్రామాలతో పాటు గిరిజన ప్రాంతం నుండి అధిక మొత్తంలో చింతపండును రైతులు తీసుకువచ్చారు. ఇక్కడి వారపు సంతలో నాణ్యమైన చింతపండు దొరుకుతుందని నమ్మకం. ఈ నేపథ్యంలోనే ఇక్కడి చింతపండు కొనుగోలుకు విశాఖపట్నం అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి ప్రజలు, చిల్లర వర్తకులు భారీగా తరలివచ్చారు. దీంతో వారపు సంత చింతపండు కొనుగోలుదారులతో కిటకిటలాడింది. మణుగు(సుమారు 10 కేజీలు) చింతపండు నాణ్యత ఆధారంగా రూ.450 నుంచి రూ.600 వరకు ధర పలికింది. ధరలు పెరిగినా కొనుగోలుదారులు సరకు కోసం పోటీలు పడ్డారు. గత వారం రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షాలకు చెట్ల నుండి చింతపండు రాలి తడిసిపోవడంతో కొంత మేర రైతులు నష్టపోయారు. అయితే పెరిగిన ధరలు వారికి కొంత ఊరటనిచ్చాయి.

### డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు



వాహనదారుడ్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీను

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం రహదారిలో ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీను ఆధ్వర్యంలో సిబ్బంది డ్రంకన్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. మద్యం సేవించిన వాహనచోదకులపై కొరడా ఝుళిపించారు. వాహనచోదకులను బ్రీత్ ఎన్‌లైజర్‌తో పరీక్షించి విడిచిపెట్టారు. చలానా చెల్లించని వాహనాలను నిలిపివేశారు. వాటిని చెల్లించిన తర్వాత విడిచిపెట్టారు.

### వేడుకగా సీతారాముల పెళ్లిరాట

ఎస్.రాయవరం : శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా తిమ్మాపురం సీతారామాలయంలో ఆదివారం పెళ్లిరాట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో చలువ పందిరివద్ద పెళ్లి రాట వేశారు. భక్తులు పాల్గొన్నారు.

# 'ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25 శాతం సీట్లు'

మాడుగుల రూరల్ : ప్రైవేట్ పాఠశాలల్లో బలహీన వర్గాల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయిస్తున్నట్టు ఎంఈవో బి.దేముడమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం మేరకు 2023-24 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అన్ని సిలబస్‌లలోనూ దీన్ని అమలు చేయనున్నట్టు పేర్కొన్నారు. వచ్చే నెల 10వ తేదీలోగా విద్యార్థులు cse. ap. gov. in తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, బలహీనవర్గాలైన ఓసీలకు 6 శాతం సీట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను వారికి కేటాయించాల్సిందేనని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలకు సూచించారు. ఈ 25 శాతం సీట్లు పొందిన విద్యార్థుల ఫీజులు ప్రభుత్వమే నిబంధనల మేరకు చెల్లిస్తుందన్నారు. బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు అర్హతగా వార్షికాదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షలుగా నిర్ధారించారు. ఈ పరిమితిలోపు ఆదాయం ఉన్న వారు మాత్రమే వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

# అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



ఒక చోట చేరిన 1968-69 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

అనకాపల్లిటౌన్: స్థానిక జీవీఎంసీ ఎంజీహెచ్ స్కూల్ ఆవరణలో ఆదివారం 1968-69 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. వీరంతా సుమారు 55 ఏళ్ల తర్వాత ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒరేయ్ ఎలాగున్నావంటూ సరదాగా పిలుచుకుంటూ సంతోషంగా గడిపి తమతమ యోగక్షేమాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బుద్ధ శివాజీ, రేలంగి సూర్యప్రకాశరావు, కుందు తులసీరాం, ఎం.బి.కె.స్వామి, బుద్ధ వీరునాయుడు, కె.ఎం.నాయుడు పాల్గొన్నారు.

# నూకాంబిక ఆలయం కిటకిట



కశింకోటలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



నూకాంబిక ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

కశింకోట: కశింకోటలోని నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య నుంచి నెల రోజులకు వచ్చే గంధ అమావాస్య వరకు అమ్మవారిని ఎక్కువ మంది భక్తులు దర్శిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూలదండలు వేసి అందంగా అలంకరించారు. దీంతో నూకాంబిక దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు వేగి శివగణేష్, వేగి రామరాజు తదితరుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

కశింకోటతోపాటు అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం, గాజువాక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో తరలి వచ్చి అమ్మవారి జాతర, గంప జాతరలు జరుపుకొని అన్నదానాలు నిర్వహించి ఆనందంగా గడిపి వెళ్లారు.

# 'పిచ్చుకల్ని కాపాడుకుందాం'




కార్యక్రమంలో మాట్లాడుతున్న రవిబాబు




చిన్నారికి మట్టిపాత్ర అందిస్తున్న రవిబాబు

అనకాపల్లిటౌన్ : జీవవైవిధ్యాన్ని, అడవుల్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.రవిబాబు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో ఆదివారం గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో పక్షులకు నీరు, తిండిగింజలు పెట్టే మట్టిపాత్రల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చుకల సంతతి నాశనం.. భవిష్యత్ ప్రకృతి విపత్తులకు సూచికగా భావించాలని హెచ్చరించారు. ఈ వేసవిలో ప్రతి ఒక్కరూ చెట్లు, ఇళ్ల మిద్దెలపై మట్టిపాత్రల్లో తిండిగింజలు, నీరు పోసి పిచ్చుకల సంతతి పెంచడంతోపాటు, పక్షుల ఆకలి, దాహం తీర్చేందుకు తోడ్పాటునందించాల్సిందిగా కోరారు. జీవవైవిధ్యంలో పిచ్చుకల పాత్రపై రజనీకాంత్ హీరోగా రూపొందించిన ×రోబో 2.0 ›చిత్రాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అంతకుముందు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ రూపొందించిన ×చేయి చేయి కలుపుదాం -పిచ్చుకల సంతతిని సంరక్షించుకుందాం›కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ విశ్రాంత అధికారి బీరా వినోద్‌కుమార్, క్లబ్ సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, భేతాళం శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి

అనకాపల్లిటౌన్: బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కార్యకర్తలు పని చేయాలని జిల్లా బూత్‌స్వశక్తి కరుణ అభియాన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి అన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో బూత్‌స్వశక్తి కరుణ అభియాన్‌లో భాగంగా ఆదివారం పార్టీ నేతలతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ మండల కమిటీలు, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షలో నేతలు, కార్యకర్తలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.ఎన్.మాధవ్ ప్రజాతీర్పును గౌరవిస్తూ సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదుతోపాటు ఎన్నికల పూర్తయ్యే వరకు పని చేసిన కార్యకర్తలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నేతలు ప్రకాష్‌రెడ్డి, ఈర్లె శ్రీరామ్మూర్తి, వివి.రామరాజు, బివిఎస్.వర్మ, చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నేతల నిరసన



నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు

అనకాపల్లి టౌన్: దేశంలో నియంతృత్వ పాలన సాగుతోందని కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు మీసాల సుబ్బన్న తెలిపారు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దుపై స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో గాంధీ విగ్రహం వద్ద ఆదివారం ఆ పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న తప్పులను దేశప్రజలకు తెలిసేలా రాహుల్ పోరాటం చేస్తున్నారనే అక్కసుతోనే అకారణంగా కేసులు బనాయించి సభ్యత్వాన్ని రద్దు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మలపురెడ్డి కోటేశ్వరరావు, సూరా శ్రీనివాస్, బోయిన భానుమూర్తి యాదవ్, కత్తెర శ్రీధర్, ఆర్.ఆర్.నాయుడు, వినకోట రాము, సత్యనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు

రోలుగుంట : స్థానిక పాత రామమందిరం వద్ద ఉగాది నుంచి ప్రారంభమైన శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ అలయ కమిటీతో కలసి ఆదివారం పూజా కార్యక్రమాలు, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామివారి దర్శనాలు, ప్రత్యేక పూజలు, రాత్రుళ్లు మహిళా బృందాల చిడతలు, కోలాటాలతో గ్రామంలో ఆధ్యాత్మికత అలముకుంది. ఈ సంర్భంగా ఉత్సవ నిర్వాహకుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ భద్రాది రామాలయం మాదిరే ఈ గ్రామంలోని రామాలయం ఏక శిలపై నిర్మించినట్టు తెలిపారు. ఈ ఉత్సవాలు 30న సీతారాముల కల్యాణంతో ముగుస్తాయన్నారు. ఆ రోజు భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

# అ'పూర్వ' కలయిక



తమకు విద్యాబోధన చేసిన అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం : మండలంలోని వేములపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986-87 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 36 ఏళ్ల తర్వాత ఒక్కటైన విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. విద్యార్థి దశలోని మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత తమ బాల్య మిత్రుల్ని కలుసుకోవడంతో ఆనంద భరితులయ్యారు. అప్పటి చిలిపి చేష్టల్ని గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు వెంకట జోగయ్య, అమీర్ సాహెబ్, కాశీ శ్రీనివాసరావు, వైవీ రమణ, ప్రస్తుత హెచ్ఎం మోహన్‌రావును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.